# అగ్నికాండం

సత్యాం మందపాటి

కృష్ణమూర్తి మళ్ళీ ఎన్నికల్లో నుంచుంటున్నాడన్నవార్త ఆ వూళ్ళో ఎవర్నీ ఆశ్చర్యపరచ లేదు. అంతకు ముందు ఐదుఏళ్ళుగా కృష్ణమూర్తి పంచాయతీబోర్డు ప్రెసిడెంటుగా వున్నాడు. ప్రజలలో పలుకుబడి కూడా వున్న వాడు. తన స్వార్ధం అసలేమాత్రం చూసుకో కుండా ఆ ఊరికోసం చాలా కష్టపడి, ఎన్నో సదుపాయాలు ఏర్పాటుచేసి, అందరికీ తలలో నాలుకలా వున్నాడు. అందుకే చాలామంది అతను మళ్ళీ ఎన్నికలలో నుంచుంటే బాగుంటుంది అనుకున్నారు. కానీ ఈమధ్య కృష్ణమూర్తిజీవితంలో జరిగిన ఓసంఘటనవల్ల కొంత మంది మాత్రం అతను యిక రాజకీయాల్లోనే కాక, ఇతరత్రా ఊళ్ళోని మరేవిధమైన కార్యక్రమాల్లోనూ తల దూర్చడని అనుకున్నారు.

కృష్ణమూర్తి జీవితంలో జరిగిన ఆ సంఘటన అతన్నేకాదు, ఆ వూరినే కదిలించి వేసింది. అసలా సంఘటన జరగటానికి ముఖ్య కారణాలు రెండు. రాజేశ్వరి అందంగా వుండటము ఒకటి, ఆమె వయసులో వుండటము, రెండవది.

రాజేశ్వరి కృష్ణమూర్తి భార్య. కృష్ణమూర్తికన్నా దాదాపు పదిహేనేళ్ళు చిన్నది. రాజేశ్వరి అంత అందంగా వుండటానికి కారణం కొనదేలి పొడుగ్గా వున్న ఆమె ముక్కు, లేత తమలపాకులంత పలచని ఆమె ఎర్రటి పెదవులు.

సూర్యారావ్ మరి అందరిలాటివాడే. అంత అందాన్నీ ఎదురింట్లో వుంచుకుని, వూరికే కూర్చోలేకపోయాడు. కృష్ణమూర్తి రాజకీయాల్లోపడి, పెళ్ళాం సంగతి పట్టించుకోక పోవటం చూసి, తను ఒక అడుగు ముందుకు వేశాడు సూర్యారావ్.

అలా అని రాజేశ్వరి శీలాన్ని శంకించ కూడదు మనం. అలనాటి పతివ్రతల్లో నయినా ఏమయినా మచ్చ వుండేమో కానీ, రాజేశ్వరి మాత్రం నిప్పులాంటిది. సూర్యారావునే కాదు, మరెవరినీ కన్నెత్తి చూడలేదు. కానీ రాజేశ్వరి అమాయకురాలు కూడా అవటంతో, సూర్యారావ్ పని మరింత సులభం అయింది.

ఒకరోజు రాత్రి కృష్ణమూర్తి ఏదో పని మీద పొరుగూరు వెళ్ళిన సమయంలో, చుట్టు పక్కల ఎవరూ లేరని నిర్ధారణ చేసుకుని, రాజేశ్వరి యింట్లో చటుక్కున దూరాడు సూర్యారావ్. ఏమీ అర్థంకాక బిత్తరపోయి చూస్తున్న రాజేశ్వరిని బలవంతం చేయ బోయాడు. ఆమె పెనుగులాడింది.

ఇంటిలోపల జరుగుతున్న గోలకి ఆ వూరి జనమంతా బయట చేరారు. లోపల ఏం జరుగుతున్నదో, ఎవరెవరున్నారో, ఎవరికి

అర్థం కాలేదు.

చివరకు అనుమానం మరింతయి ఇద్దరు బలవంతులు, తలుపులు పగలకొట్టి లోపలకు అడుగు పెట్టారు.

మెరుపులా బయటకు దూకి, చీకట్లో ఎటో మాయమయిన సూర్యారావ్ మరి యిక ఆ వూళ్లో కనపడలేదు. అతని మేనమామ గారి వూళ్లో మరదలు పిల్లతో సుఖంగా వున్నాడని తర్వాత తెలిసింది.

తలుపులు పగలకొట్టిన పెద్దల్ని, లోపలి దృశ్యం నిశ్చేష్టుల్ని చేసింది.

రాజేశ్వరి బట్టలు అన్నీ చింపివేయబడి గది మధ్యలో నగ్నంగా పడివుంది. తమల పాకులంత పలచని ఎర్రటి పెదవులు, చిట్లి రక్తం కారి మరింత ఎర్రగా వున్నాయి. కొనదేలి పొడుగ్గా వుండే ముక్కు, గోళ్ళ గుర్తులతో ఎర్రబడి మెరుస్తోంది. భుజాలమీదా, మెడమీదా, స్తనాలమీదా దాదాపు ప్రతిచోటా గోళ్ళ గుర్తులో, పంటి గుర్తులో ఏవో ఒకటి వున్నాయి. ఆమెకు మాత్రం స్పృహలేదు.

అందర్నీ బయటకు పంపించి పొరుగావిడ, యిరుగావిడ సహకారంతో రాజేశ్వరికి ఉపచర్యలు చేసి, స్పృహ తెప్పించింది.

పొరుగూరునించి ఆలస్యంగా యింటికి వస్తున్న కృష్ణమూర్తికి దారిలోనే అతని భార్య గురించి రకరకాల మాటలు వినబడ్డాయి. వెంటనే ఇంటికిచేరి, పరిస్థితి చూసి, శిలలా స్థంభించిపోయాడు.

స్పృహ వచ్చిన రాజేశ్వరి, చేతుల్లో ముఖం దాచుకుని బావురుమంది.

సూర్యారావ్ రాజేశ్వరిని చెరచబోతే, ఆమె బాగా పోట్లాడి పెనుగులాడిందనీ, అతను ఏమీ చేయక ముందే, తలుపులు పగలగొట్టడంతో అతను పారిపోయాడనీ, ఈ హడావిడికి ఆమె స్పృహతప్పి పడిపోయిందనీ, ఆమె శీలానికేమీ భంగం లేదనీ కొంతమంది అన్నారు.

లేదు, సూర్యారావ్ ఆమెను బలవంతంగా అనుభవించాడనీ, ఆమె పెనుగులాడినా లాభం లేకపోయిందనీ, చివరకు ఏమీ చేయలేని పరిస్థితులలో అతనికి లొంగిపోయిందనీ ఆమె శీలం పాడయిపోయిందనీ కొంతమంది అన్నారు.

అసలు రహస్యం అది కాదనీ, ప్రజాసేవలో మునిగిపోయిన కృష్ణమూర్తివల్ల రాజేశ్వరికి ఏమాత్రం శరీరసుఖం లేకపోవటంతో



సూర్యారావ్‌ని మరిగిందనీ, ఇది రోజూ జరిగే భాగోతమేననీ, ఆరోజు ఈరకంగా బయటపడే సరికి ఆమే బట్టలు చింపుకుని, ఒళ్ళు గీరుకుని అందర్నీ నమ్మించటానికి, అలా నాటక మాడిందనీ మిగతావాళ్ళు అన్నారు.

ఏమయినా చాలామంది రాజేశ్వరి చెడి పోయిందనే నిశ్చయానికి వచ్చారు.

ఎంతమంది ఎలా అన్నా, కృష్ణమూర్తి మాత్రం, చేతుల్లో ముఖం దాచుకుని ఏడుస్తున్న రాజేశ్వరిని, తన చేతుల్లో దాచుకుని లాలించాడు.

రాజేశ్వరి శారీరకంగా మామూలు మనిషి కావటానికి నెలరోజులు పైనే పట్టింది. కానీ మానసికంగా యింకా మెరుగవలేదు ఎప్పుడూ ఏదో ఆలోచన, పరాకు. కృష్ణమూర్తికి ఆమెని ఎలా ఓదార్చాలో అర్థంకాక, దగ్గరకు తీసుకునేవాడు.

ఈ పరిస్థితుల్లో మళ్ళీ పంచాయతీ ఎన్నికలు వచ్చాయి.

కృష్ణమూర్తి మళ్ళీ ఎన్నికలలో నుంచుందామనే నిర్ణయానికి రావటమేకాక, అలా అని ప్రకటనలు కూడా యిచ్చాడు.

ఆ వూళ్లో కృష్ణమూర్తికి చాలా మంచివాడనీ, గుణవంతుడనీ, నిజాయితీపరుడనీ పేరు వుంది. అదీకాక అతను ప్రస్తుతం కూడా ప్రెసిడెంటే కనుక కృష్ణమూర్తి యీసారి కూడా తప్పకుండా ఎన్నికవుతాడని చాలామంది అనుకున్నారు.

అలా అనుకున్న చాలా మందిలో, చాలా మంది రామదాసు ప్రచారం మొదలు పెట్టగానే వాళ్ళ అభిప్రాయాలు మార్చుకున్నారు.

రామదాసు కృష్ణమూర్తికి ప్రత్యర్థిగా ఎన్నికలలో నుంచున్నాడు. కృష్ణమూర్తికి ఆ వూళ్ళో ఎంతమంచి పేరుందో రామదాసుకీ అంతే మంచి పేరుంది. అదీకాక రామదాసు రోజూ గుళ్ళో రామాయణం మీద వుపన్యాసాలిచ్చి ఆ వూరి వారిని బాగా ఆకర్షించిన వ్యక్తి. అతను రామాయణాన్ని కాచి వడబోశాడు. ఆ వూరివాళ్ళమీద రామాయణ ప్రభావం అంత ఎక్కువగా వుండటానికి కారణం రామదాసు, అతని వాగ్ధోరణి.



అలాంటి రామదాసు, కృష్ణమూర్తికి ప్రత్యర్థిగా ఎన్నికలలో నుంచున్నాడు. అంతే కాక అతని ప్రచారధోరణి కూడా, ప్రజలలో ఒక కలకలం రేపింది. శ్రీరాముడు వనవాసం తర్వాత రాజు అయినప్పుడు అందరూ అంగీకరించిన కారణం అతని వ్యక్తిత్వమే అని చెప్పాడు. వ్యక్తిత్వం లేని మనిషి ఏనాడూ నాయకుడు కాలేడన్నాడు. మనిషికి శీలం ముఖ్యం అన్నాడు! చెడిపోయిన భార్యతో కాపురం చేస్తున్నవాడికి శీలం ఎలా వుంటుందన్నాడు. శీలం లేని పెద్దమనిషి ప్రజలకు నాయకుడెలా కాగలడన్నాడు. అసలలాటి వాడిని ప్రజలే, ఎన్నికలలో బహిష్కరించాలన్నాడు. నేను చెప్పేదేముంది, మీరే ఆలోచించుకోండి అన్నాడు.

రామదాసు మాటలు, ఆ వూరి ప్రజల్లో బాగానే పని చేశాయి. చాలామందికి అతని వివరణ నచ్చింది. నచ్చనివాళ్ళు మాత్రం అతనికెదురు తిరిగారు. అతని భార్య కావాలని సూర్యారావ్‌తో పోలేదుకదా అన్నారు. అతను బలవంతం చేస్తే, ఆవిడ అసహాయ స్థితిలో ఏం చేయగలదన్నారు. ఆవిడ తప్పేమిటన్నారు. అసలింతకీ ఆవిడ శీలం పోయిందన్నదానికి ఋజువేమిటి? సూర్యారావ్ ఏమీ పని జరక్కుండానే పారిపోయాడు కదా అన్నారు. రామదాసుని నిలిపి ఈ ప్రశ్నలన్నీ అడిగారు.

అంతా విని రామదాసు, వశిష్ఠమహామునిలా నవ్వాడు. నవ్వి నెమ్మదిగా అన్నాడు—"ఆనాడు సీతాదేవికి జరిగిందేమిటి? ఆవిడ యిష్టపడి రావణుడితో వెళ్ళలేదు కదా! అతను బలవంతంగా తీసుకుపోతుంటే అసహాయ స్థితిలో ఆవిడ ఏం చేయగలిగింది? ఆవిడ తప్పేం చేసింది? సీతాదేవి శీలం పోయిందన్నదానికి ఋజువులు ఏమీ లేవుకదా—అవునా కాదా!"

"అవును-నిజమే" వాళ్ళు అంగీకరించారు.


"మరి శ్రీరామచంద్రుడు ఒక చాకలివాడి మాటలు విని సీతాదేవిని ఎందుకు వదిలేశాడు! అలాటి స్త్రీతో వుంటే ప్రజలలో తన వ్యక్తిత్వం నిండుగా వుండదని—అలాటి స్త్రీతో వున్న వ్యక్తిని వాళ్ళు రాజుగా అంగీకరించరని తన ఈ గొప్పబుద్ధిని ప్రజలకు చూపించాలని—తనకు సీతాదేవిపై వున్న ప్రేమానురాగాల్ని,


బాధారహిత ప్రకృతిసిద్ధమైన ఆరోగ్యము మీదే!
స్త్రీల బాధలు ప్రత్యేకమైనవి
లోధ్ర
75 సంవత్సరములకు పైగా
సుఖజీవనమునకు
లోధ్ర టానిక్‌ను
వాడిన స్త్రీలు ఎందరో!
ఉచిత వైద్య సలహాకు
ఈ క్రింద పేర్కొనబడిన విలాసమునకు
ఈ కూపన్‌ను పూర్తిచేసి మీ జాబుతో పంపండి.

పేరు: ______________________
విలాసము: ______________________
______________ PIN ______________




కేసరి కుటీరం (ప్రైవేట్) లిమిటెడ్
రాయపేట, మద్రాసు-14
ఏజంట్లు: శీతారామ జనరల్ స్టోర్స్ ఏజన్సీస్ విజయవాడ — సికిందరాబాద్.




నమ్మకాల్ని కూడా ప్రక్కకునెట్టి ఆవిడ్ని వెళ్ళగొట్టి, తను రాజ్యాన్ని పాలించి, రామ రాజ్యం అని పేరు పొందాడు. అవునా— కాదా? అలాటి మహాపురుషులు పుట్టిన ఈ దేశంలో మీరు యిలాటి కృష్ణమూర్తుల పరిపాలన ఎలా అంగీకరిస్తారు? ఎన్నికలలో అతన్ని ఓడించండి. అది మీ ప్రథమ కర్తవ్యం" రామదాసు గట్టిగా నూరిపోశాడు.

ఎక్కువమంది ప్రజలకు రామదాసు వాదన సబబుగానే వున్నట్టు కనపడింది.

చాలా కొద్దిమందికి మాత్రం ఎబ్బెట్టుగా కనపడింది.

"రాముడికి, తనకే సర్వం అర్పితం చేసిన భార్యమీద ప్రేమకన్నా, రాజ్యంమీద కాంక్షే ఎక్కువగా కనబడుతున్నది. కాని కృష్ణమూర్తిగారు అలా కాదు. ఆయనకు తన భార్యవల్ల ఏమీ తప్పు లేదని గట్టిగా తెలుసు. భార్య నిరపరాధి అయినప్పుడు, ఆయన ఆవిడ నెందుకు శిక్షించాలి? హృదయపూర్వకంగా ప్రేమించిన మనిషిని, సహధర్మచారిణిని ఆయన ఎవరో కూసే ఈ మాటల కోసం వదులుకోవలసిన అవసరం లేదు. అంతేకాక నిస్వార్థంతో ఆ వూరికి ఎంతో మంచి చేసిన ఆయన, ఎన్నికలలో నుంచోవటమే కాక, గెలిచి తీరాలని కూడా వాదించారు.

కృష్ణమూర్తి కూడా కర్ణాకర్ణిగా అన్ని వాదనలూ విన్నాడు.

రాజేశ్వరిని దగ్గరకు తీసుకున్న ప్రతిసారీ "రాజీ! నువ్వే నా ప్రాణం. ఈ పదవులు వస్తే వస్తాయి లేకపోతే లేదు. కానీ నిన్ను మాత్రం వదలలేను."

"కానీ . నేను . నేను . " వెక్కి వెక్కి ఏడుస్తుంది రాజేశ్వరి.

"అదొక పీడకల-మరచిపో" అంటాడు అతను, ఆమెను తన విశాల హృదయానికి హత్తుకుని.

తర్వాత నెల రోజుల్లో ఎన్నికలు జరిగాయి. రామదాసు తన ప్రచారం అదే పంథాలో ఉధృతంగా సాగించాడు. కృష్ణమూర్తి మాత్రం తను ఆ వూరిని అంతవరకూ ఏవిధంగా అభివృద్ధి చేసేదో, మళ్ళీ అతన్నే గెలిపిస్తేయింకా ఎన్ని అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభిస్తాడో చెప్పేవాడు.

చివరికి ఎన్నికల రోజు వచ్చింది.

అందరూ ఉత్సాహంగా ఎన్నికల్లో పాల్గొన్నారు.

తరువాతరోజే ఎన్నికల ఫలితాలు కూడా తెలిశాయి!

రామదాసు ఎన్నికలలో ఎన్నడూ రానంతగా అత్యధిక మెజారిటీతో ఘనవిజయం సాధించాడు.

కృష్ణమూర్తికి ఆరు ఓట్లు మాత్రమే వచ్చాయి. □